క్లుప్తంగా

సచివాలయ సేవలపై విద్యార్థులకు అవగాహన



సచివాలయం అందిస్తున్న సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సచివాలయ సిబ్బంది

సబ్బవరం: సచివాలయాల ద్వారా ప్రజలకు అందుతున్న సేవలపై స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వృత్తి విద్యా కోర్సులు చదువుతున్న విద్యార్థులను అసకపల్లి సచివాలయానికి తీసుకెళ్లి, అక్కడ అందుతున్న సేవలపై అవగాహన కల్పించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.తిరుపతిరావు తెలిపారు. దీనిలో భాగంగా సచివాలయంలోని పలు విభాగాలు, ఆయా విభాగాల్లో ప్రజలకు అందిస్తున్న సేవలు, సచివాలయ ఉద్యోగుల విధులు, బాధ్యతలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమాన్ని అనకాపల్లి జిల్లా జీసీడీవో లక్ష్మి సందర్శించి, విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

హ్యాండ్‌బాల్ జాతీయ పోటీలకు చందు



మామిడి చందు

సబ్బవరం: జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ జట్టులో సబ్బవరం మండలం ఇరువాడ శివారు గణపతినగర్‌కు చెందిన మామిడి చందుకు స్థానం దక్కింది. అండర్-19 విభాగంలో సీబీఎస్ఈ సౌత్ జోన్ హ్యాండ్ బాల్ పోటీల్లో అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలోని శ్రీప్రకాష్ విద్యానికేతన్ తరఫున చందుతో కలిసి ప్రాతినిధ్యం వహించిన జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ పోటీలు హైదరాబాద్‌లోని మియాపూర్‌లో గల ది క్రాస్ ప్లానెట్ స్కూల్‌లో గత నెల 27 నుంచి ఈ నెల 2 వరకు జరిగాయి. ఈ జట్టు ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకు ఉత్తర ప్రదేశ్‌లోని ఘజియాబాద్ జిల్లా మోడీనగర్‌లో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి పోటీల్లో పోట్లో నుంది. ఫస్టియర్ ఇంటర్ చదువుతూ క్రీడల్లో రాణిస్తున్న చందును స్వగ్రామం ఇరువాడ, గణపతినగర్ గ్రామస్తులు అభినందించారు. చందు తండ్రి కనకరాజు ఆటో డ్రైవర్ కాగా, తల్లి త్రిమూర్తులు గ్రామ సంఘం వీవోఏగా పనిచేస్తున్నారు.

పట్టపగలే విద్యుత్ వెలుగులు



వెదుళ్లనరవ-నంగినారపాడు ప్రధాన రహదారిలో విద్యుత్ లైట్లు

సబ్బవరం: మండలంలోని జీవీఎంసీ 88వ వార్డు పరిధి నంగినారపాడు, అజనగిరి గ్రామాల్లో రాత్రీపగలూ తేడా లేకుండా విద్యుత్ దీపాలు వెలుగుతున్నాయి. రెండు మాసాలుగా ఇదే పరిస్థితి. దీనిపై పలుమార్లు స్థానికులు సంబంధిత విద్యుత్ శాఖ సిబ్బందికి ఫిర్యాదులు చేసినా పట్టించుకోని పరిస్థితి. అసలే విద్యుత్ కొరత, అనధికార కోతలతో ఇబ్బంది పడుతుంటే.. సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా మరింతగా విద్యుత్ వృథా అవుతోందని స్థానికులు ఆక్షేపిస్తున్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు

తుమ్మపాల: అనకాపల్లి జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ విజయ క్రిష్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సాగునీటి సంఘాల ఎన్నికల ఏర్పాట్లపై జల వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా నుంచి కలెక్టర్ హాజరయ్యారు. కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో ఆమె మాట్లాడుతూ సాగునీటి సంఘాల ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించాలన్నారు. ఓటరు జాబితాను సిద్ధం చేయాలన్నారు. రెవెన్యూ, సాగునీటి పారుదల శాఖ అధికారులు సమన్వయంతో నియమ, నిబంధనలకు అనుగుణంగా ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు షేక్ అయిషా, వి.వి.రమణ, నీటి పారుదల శాఖ ఈఈ ఎ.త్రినాథ్, డీఈలు, ఏఈలు, పాల్గొన్నారు.

సామాజిక భవనాలు.. నెరవేరని ప్రయోజనాలు

పరవాడ మండలంలో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన సామాజిక భవనాలు వినియోగానికి దూరమయ్యాయి. కనీస నిర్వహణ లేక ఊటగెడ్డపాలెం భవనం గచ్చులు పాడయ్యాయి. నిధుల సమస్యతో నిర్మాణం మధ్యలోనే ఆగిపోయిన గంగునాయుడుపాలెం కమ్యూనిటీ హాల్, 30 ఏళ్ల క్రితం నిర్మించిన వెంకటపతిపాలెం సామాజిక భవనం శిథిలావస్థకు చేరాయి. పట్టించుకోవాల్సిన యంత్రాంగం చోద్యం చూస్తోంది. దీంతో గ్రామ పండగలు, సభలు, సమావేశాలు, శుభకార్యాలను ఆరుబయటే చేసుకోవాల్సి వస్తోందని గ్రామస్తుల ఆవేదన.

- నిర్వహణ లేక శిథిలావస్థకు చేరిన భవనాలు
- నిర్మాణం మధ్యలోనే ఆగిన గంగునాయుడుపాలెం భవనం
- చిన్న చిన్న మరమ్మతులకూ చొరవ చూపని అధికారులు

పరవాడ: మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో చిన్న చిన్న సభలు, సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు వీలుగా నిర్మించిన సామాజిక భవనాలు శిథిలావస్థకు చేరాయి. వీటి ఆలనాపాలనా చూసే నాథుడు లేక ఏళ్ల తరబడి ఎండలకు ఎండీ, వానలకు తడిచీ మరమ్మతులకు గురయ్యాయి. పట్టించుకోవాల్సిన అధికార యంత్రాంగం కన్నెత్తి చూడని దుస్థితి. చిన్న చిన్న మరమ్మతులతో వినియోగంలోకి తీసుకొచ్చే అవకాశం ఉన్న వాటిపైనా అధికారులు దృష్టి సారించట్లేదు. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ప్రయోజనం కనిపించట్లేదని ఆయా గ్రామస్తులు వాపోతున్నారు.

శిథిల..అవస్థ



నాయుడుపాలెం శివారు వెంకటపతిపాలెంలో మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన సామాజిక భవనం శిథిలావస్థకు చేరింది. భవనం ఆలనాపాలనా చూసే వారు లేక గచ్చులు పూర్తిగా పాడయ్యాయి. పిల్లర్లు పెచ్చులూడి, ఐరన్ రాడ్లు బయటికి కనిపిస్తున్నాయి. పునాదులు దెబ్బతిన్నాయి. తలుపులు, కిటికీలు, గుమ్మాలు చెదలు పట్టి ధ్వంసమయ్యాయి. ప్రస్తుతం భవనం ఎందుకూ పనికిరాకుండా వృథాగా ఉంది. ఏ మాత్రం వర్షం వచ్చినా శ్లాబు కారిపోతోంది. గ్రామంలో పండగలు, పబ్బాలు వస్తే సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించుకోవడం కష్టంగా మారిందని గ్రామస్తులు అంటున్నారు. దీన్ని తొలగించి కొత్త భవనాన్ని నిర్మించాలని కోరుతున్నారు.

నిర్మాణ దశలోనే.. శిథిలావస్థకు..



గంగునాయుడుపాలెంలో 28 ఏళ్ల క్రితం మంజూరైన సామాజిక భవనం నిర్మాణ దశలోనే ఆగిపోయింది. నిధుల లేమి కారణంగా భవనానికి శ్లాబ్ వేసి, గోడలు నిర్మించకుండా అర్ధంతరంగా కాంట్రాక్టర్ పనుల్ని ఆపేశాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పలు ప్రభుత్వాలు మారినా అసంపూర్తిగా నిలిచిపోయిన సామాజిక భవన నిర్మాణాన్ని పూర్తి చేయడానికి కనీస చర్యలు తీసుకున్నది లేదు. ఏళ్ల తరబడి అలానే వదిలేయడంతో శ్లాబ్ పెచ్చులూడి, ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. భవన నిర్మాణం పూర్తికాకపోవడంతో గ్రామంలో ఎలాంటి సభలు, సమావేశాలు చేయాలన్నా ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు.

మరమ్మతులు చేయిస్తే సరి!



వాడచీపురుపల్లి శివారు ఊటగెడ్డపాలెంలో నిర్మించిన సామాజిక భవనం కళావిహీనంగా మారింది. కనీస నిర్వహణ లేకపోవడమే ఇందుకు కారణం. నిర్మించిన తర్వాత దీన్ని పట్టించుకునేవారు లేక గచ్చులు పాడయ్యాయి. బీమ్‌లు పెచ్చులూడుతున్నాయి. చిన్న చిన్న మరమ్మతులు చేపడితే దీన్ని నిరభ్యంతరంగా వాడుకోవచ్చు. అందుకు కనీస నిధులైనా మంజూరు చేయాలని స్థానిక వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కూండ్రపు సోమునాయుడు అధికారులకు ఇప్పటికే మొరపెట్టుకున్నారు. వీలైనంత వేగంగా మరమ్మతులు చేపట్టి, సామాజిక భవనానికి పూర్వపు రూపు తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

నూతన భవనం నిర్మించాలి



గ్రామంలో సామాజిక భవనం పూర్తిగా పాడుబడిపోయింది. ఏ కార్యక్రమం నిర్వహించాలన్నా సరైన వసతి లేక ఆరుబయటే దిక్కవుతోంది. మరోవైపు శిథిల భవనం ఏ క్షణాన కూలిపోతుందోనని భయం భయంగా కాలం గడుపుతున్నాం. కూలిపోయే స్థితిలో ఉన్న ఈ భవనాన్ని వెంటనే తొలగించి, నూతన భవన నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టాలి.

– పైల నాగేశ్వరరావు, వెంకటపతిపాలెం

అసంపూర్తి భవనాన్ని పూర్తిచేయాలి



గ్రామంలో అసంపూర్తిగా నిలిపేసిన సామాజిక భవనానికి వెంటనే నిధులు మంజూరు చేయాలి. గ్రామంలో చిన్న చిన్న సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు కనీస వసతుల్లేవు. టెంట్లు వేసుకుని ఆరు బయట సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నాం. కొత్త ప్రభుత్వంలోనైనా పనులు పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకురావాలని కోరుకుంటున్నాం.

– కూండ్రపు కృష్ణంనాయుడు, గంగునాయుడుపాలెం

నా దృష్టికి రాలేదు



వెంకటపతిపాలెంలో శిథిలావస్థకు చేరిన కమ్యూనిటీ హాల్, గంగునాయుడుపాలెంలో అసంపూర్తిగా నిలిచిపోయిన సామాజిక భవనాల దుస్థితి నా దృష్టికి రాలేదు. వీటిపై ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి అంచనా వేయిస్తాం. నిధులు, మరమ్మతులు, పునర్నిర్మాణ పనులపై ఉన్నతాధికారులకు నివేదించి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటాం.

– ఎస్.డి.శ్యామ్‌సుందర్, ఎంపీడీవో, పరవాడ

ఎండిన వృక్షం.. కూలితే ప్రమాదం

పరవాడ: వాడచీపురుపల్లి-పరవాడ రహదారిలో ఎండిన చెట్లు ప్రయాణికులను నిత్యం భయపెడుతున్నాయి. సింహాద్రి ఎన్టీపీసీ 28 ఏళ్ల క్రితం రోడ్డుకు ఇరువైపుల ప్రయాణికుల సౌకర్యార్థం నాటిన మొక్కల్లో కొన్ని చెట్లుగా ఎదిగి, తెగుళ్ల కారణంగా ఎండిపోయాయి. ఎండిన చెట్ల కొమ్మలు అప్పుడప్పుడు వర్షాలకు, ఈదురు గాలులకు విరిగి పడుతున్నాయి. ఈ రహదారిలో నిత్యం రాకపోకలు సాగించే ఎన్టీపీసీ, ఫార్మాసిటీ, హిందూజా పరిశ్రమల్లో పని చేసే ఉద్యోగులు, కార్మికులు భయపడుతున్నారు. ద్విచక్ర వాహనాలపై వెళ్లే సమయంలో అకస్మాత్తుగా భారీ కొమ్మలు నేలరాలినా, చెట్లు నేలకొరిగినా ప్రమాదానికి గురవడం తప్పదని ఆందోళన చెందుతున్నారు. చెట్లు ఎండిపోయి ఏళ్లు గడుస్తున్నా వాటిని తొలగించడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని ప్రయాణికులు ఆక్షేపిస్తున్నారు. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని రోడ్డు పక్కన ఎండిపోయిన చెట్లను వెంటనే తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కూలడానికి సిద్ధంగా ఉన్న ఎండిపోయిన చెట్టు

పరవాడ-లంకెలపాలెం రోడ్డుకు మరమ్మతులు

పరవాడ: అధ్వానంగా మారిన పరవాడ-లంకెలపాలెం రోడ్డుకు అధికారుల చొరవతో మరమ్మతులు చేపట్టారు. పరవాడ నుంచి లంకెలపాలెం రహదారిలో బొగ్గు, బూడిద లారీల రాకపోకలతో రోడ్డుపై పెద్ద ఎత్తున ఏర్పడిన గుంతలతో వాహనచోదకులు, ప్రయాణికులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. వర్షాల సమయంలో ఈ గుంతల్లో నీరు చేరడంతో రోడ్డేదో.. గుంత ఏదో.. తెలియక వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. రహదారిలో ఏర్పడిన గుంతలను గుర్తించిన పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు రాంకీ యాజమాన్యం సహకారంతో ఇటీవల గుంతలను మట్టి, బూడిదతో పూడ్చిన విషయం తెలిసిందే. దీంతో సమస్యను గుర్తించిన అధికారులు లంకెలపాలెం-పరవాడ వరకు పాడైన రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. రహదారిలో గోతులను పూడ్చడానికి కృషి చేసిన అధికారులను ప్రయాణికులు, స్థానిక ప్రజలు అభినందించారు.



పరవాడ-లంకెలపాలెం రోడ్డు గోతులు పూడ్చిన దృశ్యం

నిర్వాసిత గ్రామాల్లో సౌకర్యాల కల్పనే ఎన్టీపీసీ లక్ష్యం



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎన్టీపీసీ సీజీఎం సిన్హా, వాటాదారులతో సీజీఎం సిన్హా, అధికారులు

పరవాడ: ఎన్టీపీసీ నిర్వాసిత గ్రామాల ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఎన్టీపీసీ సింహాద్రి సీఎస్సార్ విభాగం కీలక పాత్ర పోషిస్తుందని సంస్థ హెచ్‌ఆర్ ఏజీఎం బి.బి.పాత్ర అన్నారు. ఎన్టీపీసీ పరిపాలన భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన సీఎస్సార్ వాటాదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023-24లో సీఎస్సార్ విభాగం ద్వారా నిర్వాసిత గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమాలను పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకునేలా ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని కోరారు. సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్(సీజీఎం) సంజయ్‌కుమార్ సిన్హా మాట్లాడుతూ సింహాద్రి ఎన్టీపీసీ విజయ పరంపరలో పూర్తి సహకారం అందించిన స్థానిక సంస్థల ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. విద్య, వైద్యం, నీరు, నైపుణ్యాభివృద్ధి వంటి సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. అభివృద్ధి విషయంలో పరవాడ మండలాన్ని అనకాపల్లి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు తమ వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సీఎస్సార్ విభాగం హెచ్‌ఆర్ మేనేజర్ ప్రకాశరావు మాట్లాడుతూ 2023-24లో సంస్థ సీఎస్సార్ ద్వారా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. 2024-25లో చేపట్టనున్న ప్రణాళికలను ప్రజా ప్రతినిధులకు వివరించారు. నాయుడుపాలెంలో శ్మశానవాటికలో షెడ్ నిర్మాణం, వెంకటపతిపాలెంలో సామాజిక భవనం, వాటర్ ట్యాంకు నిర్మాణాలకు సీఎస్సార్ ద్వారా నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మీసీతారామయ్య కోరారు. సంస్థ విడుదల చేస్తున్న వ్యర్థ జలాల ద్వారా నష్టపోయిన ముత్యాలమ్మపాలెం మత్స్యకారులకు సంస్థలో ఉపాధి అవకాశాలు కల్పించి, గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందించాలని సర్పంచ్ చింతకాయల సుజాతముత్యాలు కోరారు. సమావేశంలో ఓ అండ్ ఎం జీఎం ప్రశాంతకుమార్‌జెనా, టెక్నికల్ సర్వీసెస్ జీఎం ఎస్.పద్మప్రియ, డీజీఎం హెచ్‌ఆర్ శ్రీమంత మహాపాత్ర, నిర్వాసిత గ్రామాల ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

పరవాడ: యలమంచిలి-గాజువాక రహదారిలో జాజులవానిపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. అచ్యుతాపురం మండలం తమ్మయ్యపేటకు చెందిన ముచ్చు చిన్నారావు మంగళవారం తన భార్య, పిల్లలతో కలిసి పండగ దుస్తులు కొనేందుకు బైక్‌పై గాజువాక వెళుతున్నాడు. గాజువాక నుంచి పరవాడ వైపు వస్తున్న బొలెరో వ్యాన్ చిన్నారావు బైక్‌ను ఢీ కొంది. బైక్‌పై నున్న చిన్నారావు, భార్య హేమలత, కుమారుడు సాకేత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం గాజువాకలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సీఐ ఆర్.మల్లికార్జునరావు దర్యాప్తు చేస్తున్నారు.

ఖరీఫ్ వరిలో పొటాష్ లోపం

పరవాడ: వరి పంటలో పొటాష్ లోపాన్ని నివారించేందుకు వరి చిరుపొట్ట దశలో ఉన్నప్పుడు ఎకరానికి 25 కిలోల ఎంఓపీ, 25 కిలోల యూరియాను కలిపి జల్లుకోవాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్ చంద్రావతి సూచించారు. తానాం, భర్నికం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొని, రైతులకు పలు సూచనలు అందించారు. ప్రస్తుతం ఖరీఫ్ వరి పంటలో పొటాష్ లోపం ఉన్నట్లు గుర్తించామన్నారు. భర్నికంలో ఖరీఫ్ సీజన్‌లో నీరు లేదని సాగు చేయకుండా వదిలేసిన పొలంలో రబీ పంట కాలంలో తక్కువ నీటితో పండే జనుము, రాగి పంటలను వేసుకోవడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో తానాం సర్పంచ్ కన్నూరు దేవి వెంకటరమణ, పశువైద్యాధికారి అశ్విని, కృష్ణ, అప్పారావు, రైతులు పాల్గొన్నారు.



తానాంలో వరి పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి చంద్రావతి

సర్వపాప హరే దేవీ.. మహాలక్ష్మి నమోస్తుతే



ఎస్ఆర్ పురంలో లలితా త్రిపుర సుందరిగా కనకదుర్గమ్మ



సుజాతనగర్లో మహాలక్ష్మిగా కనకదుర్గమ్మ



శ్రమశక్తినగర్‌లో మంగళ గౌరిగా పంచముఖ గాయత్రీదేవి



మహాలక్ష్మి అవతారంలోని అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న స్వామీజీలు



పరదేశిమాంబ ఆలయంలో చండీయాగంలో పాల్గొన్న భక్తులు

- ఆరో రోజు ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు
- మహాలక్ష్మి, మంగళగౌరి, విజయలక్ష్మి అలంకరణలో పూజలు

పెందుర్తి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పెందుర్తి పరిధిలోని పలు అమ్మవార్ల దేవాలయాలు, మండపాల్లో ఆరో రోజు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ అవతారాల్లో అమ్మవారు భక్తులకు దర్శనభాగ్యం కలిగించారు.

● చినముషిడివాడ పంచముఖ గాయత్రీమాత ఆలయంలో భారీ ఎత్తున కుంకుమార్చన జరిపారు. ముందుగా అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేశారు. మంగళగౌరిగా అమ్మవారు పూజలందుకున్నారు. ప్రసాద వితరణ చేపట్టారు.

● సప్తగిరినగర్‌లోని అలివేలు మంగమ్మ సన్నిధిలో సామూహిక కుంకుమ పూజలు చేశారు. అమ్మవారికి విశేష అభిషేకాలు జరిపారు. విజయలక్ష్మిగా భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు.

● పెందుర్తి మహాకామేశ్వరీ ఆలయంలో అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరణ చేశారు. సామూహిక కుంకుమ పూజలు జరిపారు. ముందుగా అమ్మవారికి విశేష అర్చనలు నిర్వహించారు.

● ఎస్ఆర్ పురంలోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని లలితా త్రిపుర సుందరిదేవిగా అలంకరణ చేశారు. ముందుగా అమ్మవారికి విశేష అర్చనలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కాయిత ఎర్రిబాబు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

● సుజాతనగర్ అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరణ చేశారు. సామూహిక కుంకుమ పూజలు జరిపారు. అమ్మవారికి విశేష అర్చనలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేపట్టారు.

● 96వ వార్డు పెందుర్తిలోని పరదేశిమాంబ ఆలయంలో చండీయాగం ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం టీటీడీ వేద పండితుల ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నేత, మాజీ కార్పొరేటర్ శరగడం చినఅప్పలనాయుడు, అనురాధ దంపతుల చేతుల మీదుగా క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించి, పూర్ణాహుతి జరిపారు. భవానీ భక్తులకు శరగడం ఆధ్వర్యంలో భిక్ష ఏర్పాటు చేశారు.



దలాయిపాలెం దుర్గాభవానీ పీఠంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

● దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చినముషిడివాడలోని శారదాపీఠంలో ఆరోరోజు మంగళవారం మహాలక్ష్మిగా శారదాస్వరూప రాజశ్యామల అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీల చేతుల మీదుగా అమ్మవారికి పూజలు జరిగాయి. సాయంత్రం కుంకుమ పూజ, సువాసిని పూజల్లో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. శ్రీచక్రానికి పూజలు జరిపారు. అమ్మవారికి స్వామీజీ చేతులమీదుగా ఏకాదశ హారతులిచ్చారు.

పరవాడ: వాడచీపురుపల్లి శివారు దలాయిపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన శ్రీదుర్గా భవానీ పీఠంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్తరాంధ్ర బీసీ ఉపాధ్యక్షుడు కూండ్రపు కృష్ణంనాయుడు పాల్గొని, పూజలు జరిపారు. శుక్రవారం దలాయిపాలెం పీఠం, వాడచీపురుపల్లి పీఠా ల్లో నిర్వహించే అన్న సమారాధనలకు సాయంచేశారు.

సింహాచలం: అడవివరంలోని హవేళి ప్రాంగణంలో శ్రీ వరాహలక్ష్మీ నృసింహ ఫ్రెండ్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న దుర్గాదేవి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆరవరోజు మంగళవారం అమ్మవారు మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చింది. అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించారు. ఉత్సవాల్లో భాగంగా చండీ హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సంఘ ప్రతినిధి ఫణిమనోహర్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలో నిర్వహిస్తున్న దసరా బ్రహ్మోత్సవాల్లో భాగంగా సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవిని మహాలక్ష్మి రూపంలో అలంకరించి మంగళవారం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అమ్మవారి సన్నిధిలో నిర్వహించిన మహాలక్ష్మి సహస్ర నామావళి హోమం, నిత్యదేవి పూజల్లో కెనడా నుంచి వచ్చిన తారా మనియార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి క్షీరాభిషేకం నిర్వహించి నూతన వస్త్ర, అభరణాలను అలంకరించారు. ఉత్సవాల్లో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సాయంత్రం లిపికారెడ్డి శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఆహూతుల్ని ఎంతగానో ఆకట్టుకుంది.



దేవీపురం రాజరాజేశ్వరి సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన